కిరాణా దుకాణం యజమానిపై కేసు నమోదు

● సిలిండర్ స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకుంటున్న ఏఎస్ఓ బాలసరోజ తదితరులు

చంపాపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని శ్రీలక్ష్మీ నర్సింహ కిరాణా దుకాణంపై బుధవారం పౌర సరఫరాలశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'గుట్టుగా సాగుతున్న గ్యాస్ సిలిండర్ల దందా' అనే వార్తకు అధికారులు స్పందించారు. డీఎస్ఓ ఆదేశాల మేరకు సరూర్‌నగర్ మండలం పౌర సరఫరాలశాఖ ఏఎస్ఓ బాలసరోజ, ఇన్‌స్పెక్టర్లు నావిద్, మోహిన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నర్సింహారెడ్డి షాప్‌ను తనిఖీ చేశారు. విక్రయానికి సిద్ధంగా ఉన్న ఇండియన్ గ్యాస్ సబ్సిడీ సిలిండర్‌ను వారు స్వాధీనం చేసుకున్నారు. షాప్ యజమాని సాయి కుమార్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ నర్సింహారెడ్డి తెలిపారు. టిఫిన్ సెంటర్లు, హోటళ్లలో సబ్సిడీ సిలిండర్లు వినియోగిస్తున్నా, కిరాణా దుకాణాలలో విక్రయించినా కేసులు నమోదు చేయనున్నట్లు ఏఎస్ఓ తెలిపారు. బుకింగ్ లేని వారికి సిలిండర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు గ్యాస్ ఏజెన్సీ ఆటో సిబ్బందికి వారు హెచ్చరించారు.

హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యేల పూజలు

చంపాపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దంపతులు, దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వినాయక స్వామి, ధ్యానాంజనేయస్వామి ఆలయంలో వారు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పండితులు, అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మలు ఎమ్మెల్యేలకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్, కిరణ్‌కుమార్‌గుప్తా, మేక సురేందర్‌రెడ్డి, చీర తిరుమలేష్, మధుసాగర్, సతీష్‌గౌడ్, యాదగిరి, శ్రీనివాస్‌యాదవ్, గూడూరు మధుసూదన్‌రెడ్డి, సురేష్, శైలజ, నాయకులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా అమరేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

హయత్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా కె. అమరేందర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేసిన సత్యనారాయణరెడ్డి సస్పెన్షన్‌కు గురి కావడంతో మీర్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్‌కు తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కొంత కాలంగా పోస్టింగు కోసం ఎదురు చూస్తున్న అమరేందర్‌రెడ్డిని మంగళవారం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు తుర్కయంజాల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బాధ్యతలు తీసుకున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ కౌన్సిల్, అధికారులు కలిసి పని చేస్తే తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు కమిషనర్‌ను కలిసి శాలువతో సన్మానించారు.

జడ్‌సీని కలిసిన కార్పొరేటర్

చంపాపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్ బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి బొకే అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని వివిధ కాలనీల అభివృద్ధి పనులకు నిధులతో పాటు ఆదర్శనగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు జడ్‌సీ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, దేరంగుల కృష్ణ భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి చొరవతీసుకోండి: రాగుల

వనస్థలిపురం, జూలై 3(ఆంధ్ర జ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చొరవతీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ను కోరారు. బుధవారం జోనల్ కమిషనర్ కార్పొరేటర్‌తో కలిసి వనస్థలిపురం డివిజన్‌లోని క్రిస్టియన్‌కాలనీ, నాగార్జునకాలనీ, హస్తినాపురం సెంట్రల్, మల్లికార్జుననగర్ తదితర కాలనీల్లో పర్యటించి కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలి: కార్పొరేటర్

వనస్థలిపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఎన్జీవోస్ కాలనీలో జరుగుతున్న రోడ్డు బ్యూటిఫికేషన్ పనుల వల్ల కాలనీవాసులకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు విన్నవించారు. ఈ మేరకు స్పందించిన కార్పొరేటర్ రోడ్డు బ్యూటిఫికేషన్ పనులను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టాలి

వనస్థలిపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ను కోరారు. బుధవారం కార్పొరేటర్ డివిజన్‌కు సంబంధించిన రోడ్డు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మన్సూరాబాద్‌లోని బిగ్‌బజార్ నుంచి సుష్మ చౌరస్తా వరకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చొరవతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీసీ తిప్పర్తి యాదయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

శివగంగకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): శివగంగకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం కాలనీ ప్రతినిధులు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. పాత డ్రైనేజీ పైప్‌లైన్లతో దారులపై మురుగు సమస్యలు తలెత్తుతున్నాయని, కాలనీలో గల చెత్త చేరవేసే పాయింట్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మిపతిగౌడ్, ప్రతినిధులు సుబ్బారావు, అవినాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టూవీలర్ మెకానిక్‌ల దినోత్సవం

సైదాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ టూవీలర్ మెకానిక్‌ల దినోత్సవాన్ని బుధవారం వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏఅండ్‌ఎం టూ వీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు సబితారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిలు హాజరయ్యారు. మెకానిక్ కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంబోజి నరేందర్‌యాదవ్, గౌరవ అధ్యక్షుడు ఎం, ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, రమేష్‌రావు, బీరప్పయాదవ్‌లతో పాటు మలక్‌పేట, యాకత్‌పురా, ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మెకానిక్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

కొత్తపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ అన్నారు. బుధవారం అల్కాపురి వావెల్స్ స్కూల్ నుండి 90 మంది చిన్నారులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కును సందర్శించారు. ఆటోల్లో, బైక్‌లపైనా, స్కూల్ బస్సుల్లో ప్రయాణించే వేళ జాగ్రత్తలపై ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో టీటీఐ సిబ్బంది రవి, ఢిల్లీ హీరో మోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ సాదిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు ఆత్మీయ సన్మానం

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని ఎంపీటీసీల పదవీ కాలం బుధవారంతో ముగిసింది. మండలంలో మొత్తం 11మంది ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం పూర్తి కావడంతో గురువారం నుంచి మాజీలుగా మారనున్నారు. పదవీ కాలం ముగియడంతో హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో వాణిశ్రీ, ఎంపీవో వినోద, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ రైతుబజార్ ఆధునికీకరణకు కృషి: సబితారెడ్డి



రైతుబజార్‌లో విక్రయదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్‌బీనగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ రైతుబజార్ ఆధునీకరణకు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ రైతుబజార్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతుబజార్‌ను కలియదిరిగి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రైతుబజార్ రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసినది కావడంతో రైతులకు, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రైతుబజార్‌లో షెడ్ల నిర్మాణం కొద్దిగా ఎత్తు పెంచి సహజంగా గాలి, వెలుతురు వచ్చే విధంగా నూతన నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్లపై వ్యాపారం చేసుకునే తోపుడు బండ్ల వ్యాపారులకు రైతుబజార్‌లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతుబజార్‌లో నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రైతులు, వినియోగదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం బీజేఆర్‌భవన్‌ను ఆమె సందర్శించారు. భవనాన్ని పరిశీలించి అత్యాధునిక వసతులతో ఆధునీకరించాలని అసిస్టెంట్ ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి కుసుమ లావణ్యకు సూచించారు. ఎండాకాలంలో నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో బోర్ వేయించడంతో పాటు బీజేఆర్‌భవన్‌లో కార్యక్రమాలు చేసుకునే నిర్వాహకుల కోసం వంట చేసుకునే విధంగా వెనుక భాగంలో రేకుల షెడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఆధునీకరణ కోసం రూ. 4కోట్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. పూర్తి వివరాలతో అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ సెక్రటరీ చిలుక నర్సింహారెడ్డి, రైతుబజార్ ఈఓ స్రవంతిరెడ్డి, డీఈ రవీందర్, మురుకుంట్ల అరవింద్‌శర్మ, లోకసాని కొండల్‌రెడ్డి, రామ్‌నర్సింహగౌడ్, ఇంటూరి అంకిరెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, పెండ్యాల నగేష్, ఊర్మిళారెడ్డి, సాజిద్, శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రహదారిని పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలో బుధవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి పర్యటించారు. చంపాపేట డివిజన్‌లోని బైరామల్‌గూడ చెరువును ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువులోకి మురికి నీరు రాకుండా చర్య లు తీసుకోవాలని, పూడికతీత పనులకు ఓ వ్యక్తిని నియమించాలని కో రారు. చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం హస్తినాపురం డివిజన్‌లోని సాయిప్రకాష్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు ప్రైవేట్ వ్యక్తులు రోడ్డు స్థలం తమదని చెప్పి సీసీ రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారని పేర్కొన్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు అది పబ్లిక్ సొసైటీ రోడ్డు అని నిర్ణయించినట్లు, రెండు, మూడు రోజుల్లో మిగిలిపోయిన 150 ఫీట్ల సీసీ రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డీసీ జాకియా సుల్తానా, ఇంజనీరింగ్ అధికారులు అశోక్‌రెడ్డి, హేమునాయక్, సురేష్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, నాయకులు రఘుమారెడ్డి, శ్రీనివాస్‌నాయక్, కాలనీ ప్రతినిధులు రాఘవేంద్ర, రామకృష్ణ, ప్రవీణ్, రాజశేఖర్, హరికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైరామల్‌గూడ చెరువును సందర్శించిన జోనల్ కమిషనర్



బైరామల్‌గూడ చెరువును కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డితో కలిసి పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్

చంపాపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని బైరామల్‌గూడలోని చెరువును బుధవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సందర్శించారు. అనంతరం రెడ్డికాలనీలో ఎస్‌ఎన్‌డీపీ కింద చేపట్టనున్న నాలా నిర్మాణ పనుల ప్రాంతాన్ని వారు పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ బైరామల్‌గూడ చెరువు వద్ద ప్రణాళిక పద్ధతిలో పనులు చేపట్టకపోవడంతో చెరువులోకి మురికినీరు చేరుతుందని జడ్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. చెరువు జంక్షన్ వద్ద క్లీనింగ్ సరిగా లేకపోవడంతో చెత్త, చెదారం పేరుకు పోతుందని అన్నారు. ఇక్కడి నుంచి మూసీ వరకు మురికి నీరు సాఫీగా వెళ్లేందుకు ప్రత్యేక ట్రంక్‌లైన్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఎంపీ ఈటల రాజేందర్ ద్వారా నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తామని కార్పొరేటర్ చెప్పారు. చంపాపేట డీమార్టు నుంచి రెడ్డికాలనీ మీదుగా జేఎస్‌ఆర్ స్విమ్మింగ్ పూల్ వరకు నాలా నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని జడ్‌సీని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ ఉపకమిషనర్ జకియా సుల్తానా, ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, ఈఈ కార్తీక్, ఏఈ సురేష్, టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ శ్రీదేవి, శానిటేషన్ డీఈ వెంకటేశ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు బాల్‌రాజ్, కాలనీవాసులు రాములు, కృష్ణకుమార్, రాజు, రాజేందర్, పెంటయ్య, రవి పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైతన్యయాదవ్, బాలకృష్ణ

చాదర్‌ఘాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యా రంగం, పరీక్షల నిర్వహణ, పేపర్ లీకేజీల పట్ల మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కేజీ టూ పీజీ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం తలపెట్టిన దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.చైతన్యయాదవ్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ విద్యా సంస్థల యాజమాన్యాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లో దేశ వ్యాప్త బంద్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ యూజీసీ నెట్ పరీక్ష పేపర్ల లీకేజీలో నష్టపోయి ఆందోళన చెందుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పూర్తి స్థాయి భరోసా కల్పించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ యూజీసీ నెట్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ గురువారం నిర్వహించే బంద్‌కు ప్రజాస్వామికవాదులు, విద్యావేత్తలు, మేధావులు కూడా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు మహమూద్, అనిల్‌కుమార్, వంశీ, రాహుల్ దశరథ్, అంజి పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి: ఎస్ఎఫ్ఐ

ఎల్‌బీనగర్: పరీక్షల నిర్వహణ పట్ల పేపర్ లీకేజీలపై మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కేజీ టూ పీజీ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం జరుప తలపెట్టిన దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ విద్యా సంస్థల యాజమాన్యాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్, డివిజన్ కమిటీ సభ్యులు నరేష్, పవన్, తరుణ్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

హయత్‌నగర్: నీట్ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన పోస్టర్‌ను బుధవారం రావి నారాయణరెడ్డి కాలనీలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, అరుణ్‌కుమార్ గౌడ్, వెంకటేశ్, బన్నీ, ఉపేందర్, వరుణ్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా కాంతిలాల్ పాటిల్




డీసీపీ కాంతిలాల్ పాటిల్

సైదాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): సౌత్ ఈస్ట్ జోన్ నూతన డీసీపీగా కాంతిలాల్ పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ధరావత్ జానకీ భద్రాది మహబూబ్‌నగర్ ఎస్పీగా బదిలీ కాగా భైంసా ఏఎస్పీగా పనిచేస్తున్న కాంతిలాల్ పాటిల్ ఈస్ట్ జోన్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామని అన్నారు. జోన్‌కు చెందిన పోలీస్ అధికారులు డీసీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

సైదాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షురాలు మంజులారెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్ మండల కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారెడ్డి, జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా హామీలు అమలుచేయడంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి రుక్మిణి, జిల్లా ఉపాధ్యక్షురాలు శోభ, కార్యదర్శులు స్వప్న, లావణ్య, సురేఖ, సంధ్య, సుష్మ, రమాదేవి, వనజ, జమున తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



లహరి

సైదాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలిక కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విష్ణునగర్‌లో నివాసముండే గుండు యాదమ్మ కొమురయ్యల కూతురు లహరి(17) పదోతరగతి పాసై ఇంట్లో ఉంటున్నది. సోమవారం మధ్యాహ్నం బట్టలు ఇంటి బయట ఆరవేయడానికివెళ్లి కనిపించకుండాపోయింది. దీంతో కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం వెదకినా దొరకలేదు. దీంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కూతురుకి మాయమాటలు చేపి రాజు అనే యువకుడు కిడ్నాప్ చేశాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక కార్యవర్గం ఎన్నిక

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక సమావేశం బుధవారం మండల కేంద్రంలోని వైఎస్‌ఆర్‌గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఐక్యవేదిక మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐక్య వేదిక మండల అధ్యక్షుడిగా ఇనాంగూడకు చెందిన అంతటి ధనుంజయగౌడ్‌ను ఏకగ్రీవంగా ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా గుండె రవీందర్, ఉపాధ్యక్షులుగా ఏసూరి జంగయ్య, నంగునూరి నాగరాజ్, సహాయ కార్యదర్శిగా అత్తాపురం లావణ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ధనుంజయగౌడ్ మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆస్తులను పోగొట్టుకున్న ఉద్యమకారులందరికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుర్రని వెంకటేశ్‌గౌడ్, కూతాటి సుధాకర్, గుండె జంగయ్య, కృష్ణ, బద్దుల కృష్ణకుమార్, జంగంగౌడ్, ఉద్యమకారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి

ఎల్‌బీనగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సోషలిస్ట్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్ డిమాండ్ చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రామారావునాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో విద్యార్థులకు దుప్పట్లు, బెడ్‌షీట్స్ పంపిణీ చేయాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు పరిసర ప్రాంతాలలో బాల, బాలికలకు నూతన సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలకుర్ల మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ ఆస్పత్రిలో డాక్టర్‌పై

మృతుడి బంధువుల దాడి

● కేసు నమోదు

కొత్తపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ హెల్త్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందడంతో ఆందోళన చేపట్టిన ఆ యువకుడి బంధువులు డాక్టర్‌పై దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డా.అద్దంకి పరిపూర్ణాచారి ఎల్బీనగర్ హెల్త్ కేర్ ఆస్పత్రిలో అనస్థీషియా స్పెషలిస్టుగా పనిచేస్తున్నారు. హయత్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బీ.కళ్యాణ్(26) గత నెల 30వ తేదీన కామెర్ల వ్యాధి చికిత్స కోసం ఎల్బీనగర్ హెల్త్‌కేర్ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షల అనంతరం తల్లి అనుమతి తీసుకుని అతడిని ఐసీయూకు తరలించారు. ఈనెల 2వ తేదీన రాత్రి అతడు చికిత్స పొందుతూ, గుండెపోటు రావడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు ఆస్పత్రి వద్దకు చేరుకుని డాక్టర్ల నిర్లక్ష్యంతోనే కళ్యాణ్ మృతి చెందాడని ఆందోళనకు దిగారు. కోపోద్రిక్తులై ఆస్పత్రి ఐసీయూలోకి చొరబడిన మృతుడి బంధువులు ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు డా.అద్దంకి పరిపూర్ణాచారిపైన, సిబ్బందిపైన దాడి చేశారు. స్థానికులు సమాధానపర్చడంతో కళ్యాణ్ మృతదేహాన్ని తీసుకుని వెళ్లి పోయారు. డా.అద్దంకి పరిపూర్ణాచారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ తరుణ్‌జోషి తదితరులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

● సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): చదువుకుంటూ ఆటపాటలతో గడపాల్సిన పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్న బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని రాచకొండ సీపీ తరుణ్‌జోషి అన్నారు. నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఆపరేషన్ ముస్కాన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను, గుర్తించేందుకు 'దర్పణ్' ఫేస్ రిగగ్నైజేషన్ అప్లికేషన్‌ను వినియోగించాలని కోరారు. సమాజంలో బాలకార్మిక వ్యవస్థ ఒక వ్యాధిలాగా మారిందని, అది పిల్లల బాల్యాన్ని నాశనం చేస్తోందని, తల్లిదండ్రుల పేదరికం వల్ల పిల్లలు వెట్టిచాకిరీ కోరల్లో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా, తమ పిల్లలను మాత్రం వెట్టిచాకిరీ కూపంలోకి నెట్టకూడదని, పిల్లల చదువు కోసం ప్రభుత్వం ఉచితంగా ఎన్నో కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమిషనరేట్ పరిధిలో మానవ అక్రమ రవాణా మీద ఉక్కు పాదం మోపుతున్నామని, ప్రత్యేక బృందాల ద్వారా ఎంతో మందిని రక్షించామని, నిందితులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి

సరూర్‌నగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 26వ డివిజన్ పరిధిలో గల కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సంబంధ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని స్థానిక కార్పొరేటర్ రామిడి కవితారాంరెడ్డి ట్రాన్స్‌కో అధికారులను కోరారు. బుధవారం ఆమె భర్త రాంరెడ్డి పలు కాలనీల ప్రతినిధులతో కలిసి తుర్కయంజాల్ విద్యుత్ కేంద్రంలో ట్రాన్స్‌కో ఏడీకి వినతి పత్రం అందజేశారు. అనిల్‌రెడ్డి, సురేశ్, శేఖర్, రాజు, యాదయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో

భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

● ఉత్తర్వులు జారీ చేసిన నగర కొత్వాల్

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పలువురు పోలీసు అధికారులు ఏసీబీకి పట్టుబడడం, పలువురిపై అవినీతి ఆరోపణలు రావడంతో ప్రక్షాళన చేసే దిశగా పోలీస్ బాస్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా భారీగా బదిలీలు చేస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.చంద్రశేఖర్	ఎస్‌బీ(స్పెషల్ బ్రాంచి)	ఎస్‌హెచ్‌ఓ కాచిగూడ
పి.లక్ష్మీకాంత్‌రెడ్డి	ఎస్‌హెచ్‌ఓ కాచిగూడ	మల్టీజోన్-2
ఎ.ఆంజనేయులు	ఎస్‌హెచ్‌ఓ తుకారంగేట్	సీసీఎస్ డీడీ
జి.నాగరాజు	ఐటీసెల్	ఎస్‌హెచ్‌ఓ తిరుమలగిరి
సుంకరి విజయ్	ఎస్‌హెచ్‌ఓ తిరుమలగిరి	సరెండర్
డి.మధుసూదన్‌రెడ్డి	ఎస్‌హెచ్‌ఓ మధురానగర్	వెస్ట్‌జోన్ పీసీఆర్
వై.అజయ్‌కుమార్	మల్టీజోన్-2	ఎస్‌హెచ్‌ఓ మధురానగర్
టి.కొమరయ్య	డీటీసీ, నల్గొండ	ఎస్‌బీ
ఎస్.సుధీర్‌కుమార్	వెస్ట్‌జోన్ పీసీఆర్	సరెండర్
చుక్కపల్లి పరుశురాం	ఎస్‌బీ	ఎస్‌హెచ్‌ఓ మాసబ్‌ట్యాంక్
జి.గౌరీదేవి	ఎస్‌హెచ్‌ఓ మాసబ్‌ట్యాంక్	సరెండర్
మహ్మద్ ఆసిఫ్	డీఐ టప్పాచబుత్ర	ఎస్‌హెచ్‌ఓ కాలపత్తర్
రౌతు గోపీ	ఎస్‌హెచ్‌ఓ నాంపల్లి	డీఐ టప్పాచబుత్ర
కె.మహేశ్	ఎస్‌హెచ్‌ఓ గోషామహల్(ట్రాఫిక్)	సరెండర్
టి.అశోక్‌కుమార్	సీసీఎస్ మహబూబ్‌నగర్	ఎస్‌హెచ్‌ఓ మలక్‌పేట్(ట్రాఫిక్)
జి.సైదులు	మల్టీజోన్-2	డీఐ చాదర్‌ఘాట్
ఎస్.సైదులు	ఎస్‌హెచ్‌ఓ చాదర్‌ఘాట్	మల్టీజోన్-2
ఎం.రాజు	మల్టీజోన్-2	ఎస్‌హెచ్‌ఓ చాదర్‌ఘాట్
పి.సురేశ్	ట్రాఫిక్ అడ్మిన్	మల్టీజోన్-2
బి.నర్సయ్య	ట్రాఫిక్ అడ్మిన్	మల్టీజోన్-2
ఇ.వెంకటరెడ్డి	ఎస్‌హెచ్‌ఓ ఉప్పల్(ట్రాఫిక్)	ట్రాఫిక్ అడ్మిన్
యు.శ్రీనివాసులురెడ్డి	మల్టీజోన్-2	ట్రాఫిక్ అడ్మిన్
పి.మహేందర్	మల్టీజోన్-2	డీఐ మంగళ్‌హాట్
బి.రవికిరణ్	మల్టీజోన్-2	సీసీఎస్ డీడీ
ఎం.శంకర్	టీజీ సీఅండ్‌సీసీ	ఎస్‌హెచ్‌ఓ, తుకారాంగేట్
ఎం.అప్పలనాయుడు	మల్టీజోన్-2	ఎస్‌హెచ్‌ఓ, నాంపల్లి
ఎంఎస్ ఆనంద్‌కుమార్	ట్రాఫిక్ పీఎస్ నల్గొండ	డీఐ, సైదాబాద్
కె.కొండలరెడ్డి	డీఐ సైదాబాద్	మల్టీజోన్-2
వై.రామలింగారెడ్డి	డీఐ ఖైరతాబాద్	మల్టీజోన్-2
బి.శంకర్	సీసీఎస్ డీడీ	మల్టీజోన్-2
ఎస్.రాఘవేంద్ర	ఎస్‌బీ	టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్
జాకీర్ హుస్సేన్	టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్	మల్టీజోన్-2
కెఎస్ ప్రసాద్‌వర్మ	పీసీఆర్ సౌత్‌జోన్	టాస్క్‌ఫోర్స్ ఈస్ట్‌జోన్
డి.వెంకట్ రెడ్డి	టాస్క్‌ఫోర్స్ ఈస్ట్‌జోన్	ఎస్‌బీ
కె.సైదులు	సైబర్ క్రైమ్స్	టాస్క్‌ఫోర్స్ నార్త్‌జోన్
ఎం.రామక్రిష్ణారెడ్డి	సీసీఎస్ డీడీ	మల్టీజోన్-2
సీతారాములు	మల్టీజోన్-2	సీసీఎస్ డీడీ